క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



సఖినేటిపల్లిలో ఇఫ్తార్ విందులోపాల్గొన్న ముస్లింలు

సఖినేటిపల్లి: ముస్లింలకు రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. మండల ఎస్టీయూ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన ముస్లిం మత పెద్ద పాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ నరహరిశెట్టి సత్యనారాయణ, ఎన్.శివప్రసాద్, ఎస్.ఎస్.పళ్లంరాజు, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల విభాగం ఏర్పాటు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య పరంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. ఈ రెండు విభాగాల సమస్యలపై ఫిర్యాదులు చేయాలనుకున్నవారు 78937 90444 ఫోన్ నెంబరుకు వాట్సాప్ లేదా ఫోన్ చేసి సమస్యను వివరించొచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేస్తారని స్పష్టం చేశారు. ఫిర్యాదుల విభాగాన్ని, దానికి ఇచ్చిన ఫోన్ నెంబరును పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మనోహర్ విజ్ఞప్తి చేశారు.

యువత రక్తదానం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని దళిత సేన ఆధ్వర్యంలో బుద్ధ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజ, విజయ మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ అంబేడ్కర్ రతన్ బెనర్జీ గంటాలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 25 మంది యువత రక్తదానం చేశారు. ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేడ్కర్, పినిపే రవికుమార్, వాకపల్లి హరీష్, సాపే రమేష్, బత్తుల శీను, ధోనిపాటి నవీన్, చిత్రపు జయరాజ్, బొంతు ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ శంకరరావు, పవన్‌కుమార్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు సూచన మేరకు ప్రతి నెలా 9వ తేదీన ఆస్పత్రికి వచ్చే స్కానింగ్ రోగులకు కూడా అన్నదానం ఏర్పాటు చేస్తామని పవన్‌కుమార్ ప్రకటించారు. అన్నదాన క్యార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ, ట్రస్ట్ ప్రతినిధి సలాది నాగేశ్వరరావుతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యానాంలో నమశ్శివాయం ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయం గురువారం యానాం విచ్చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆయనతో పాటు సీఎం రంగసామి, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ సైతం వస్తారని భావిస్తున్నారు. స్థానిక ఫెర్రీ రహదారిలోని గాజుల గార్డెన్స్‌లో సభను ఏర్పాటు చేస్తున్నట్లు కూటమికి మద్దతిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే బహిరంగ సభకు నియోజకవర్గ పరిధిలోని తన అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. నమశ్శివాయం ప్రచారంలో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి భారీ బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. తన స్వగృహం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన తన అభిమానులు, కార్యకర్తలను కోరారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

అల్లవరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించామని ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం తెలిపారు. కోడూరుపాడు, బెండమూర్లంక, గోడిలంక, దేవగుప్తం, బోడసకుర్రు గ్రామాల్లో ఇప్పటికే చలివేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా ఒక జగ్గిరెడ్డిలా కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి జగ్గిరెడ్డి పిలుపు



కొత్తపేట, మందపల్లి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మళ్లీ తన విజయం కార్యకర్తల విజయమని, ప్రతి ఒక్కరూ ఒక జగ్గిరెడ్డి అనుకుని కృషి చేయాలని ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి సమాయత్తంలో భాగంగా కొత్తపేట, మందపల్లి గ్రామాల పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం ఉదయం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు అధ్యక్షతన వహించగా ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జనసేన, టీడీపీ కలిసిపోయాయి, విజయం మాదేనని నియోజకవర్గంలో ప్రతిపక్ష టీడీపీ నాయకులు చంకలు బాదుకుంటున్నారని, 2014లో టీడీపీ గాలిలో సైతం, నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకులందరూ కలిసినా తాను ఘన విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు కూడా నా కుటుంబ సభ్యులైన మీ అందరి అండదండలతో ఎందరు కలిసినా ఢీకొనే ధైర్యం, సత్తా తనకున్నాయన్నారు. అంతేకాకుండా ఐదేళ్ల వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాల ప్రభావంతో ప్రజా సానుకూల పవనాలు మనకే అనుకూలంగా ఉన్నాయని, అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రతి కుటుంబానికీ ఐదేళ్లలో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఆర్థిక ప్రయోజనం కల్పించిందన్నారు. తద్వారా సీఎం జగన్ ప్రజలను ఓటు అడిగే హక్కు, అర్హత ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తకే కల్పించారన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న మనస్పర్ధలు ఉన్నా వాటిని సరిదిద్దుకుని ముందుకు వెళ్లడం ద్వారా జగ్గిరెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం వాడపాలెంలో, మధ్యాహ్నం మోడేకుర్రు, బిళ్లకుర్రు గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొప్పన శివ, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, జిల్లా పార్టీ సభ్యుడు సత్యవరపు జమీందార్, మందపల్లి, మోడేకుర్రు వీడీసీ కన్వీనర్లు సాదు చెంచయ్య, కుడుపూడి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

వైద్యాధికారులుగా ఇంద్రావతి, గీతాంజలి

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీ వైద్యులుగా ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలిలు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ఇంద్రావతి అల్లవరం మండలం బెండమూరులంక నుంచి, డాక్టర్ గీతాంజలి కపిలేశ్వరపురం మండలం అంగర నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. వీరి డిప్యుటేషన్ రద్దు కావడంతో తిరిగి విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ జి.రమ్యశైలజ లూటుకుర్రు బదిలీపై వెళ్లారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు మౌనిక రాణి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 45 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ కె.దుర్గాభాయి, సీహెచ్ మరియమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే..



మలికిపురంలో నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి, వ్యాపారవేత్త చంటిరాజు

- వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి
- మలికిపురంలో నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభం

మలికిపురం: వచ్చే ఎన్నికల అనంతరం రాష్ట్రానికి కాబోయే నూతన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త కేవీ చంటిరాజు పేర్కొన్నారు. మలికిపురంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో బుధవారం ఉదయం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని, నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, పారిశ్రామిక వేత్త కునాథరాజు వెంకట రామకష్ణ (చంటిరాజు) రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇరువురూ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు తాము సర్వం సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించాలన్న తపనతో ఉన్నారన్నారు. ప్రతిపక్ష నాయకుల కుయుక్తులు, కల్లబొల్లి రాజకీయాలను పటాపంచలు చేసి రాబోవు ఎన్నికల్లో కచ్చితంగా మెజార్టీ సాధిస్తామన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపామని ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల అందించామని ఓటు అడిగే హక్కు తమకు మాత్రమే ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీగా రాపాక వరప్రసాద్‌లను గెలిపించి, సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని, ఇందుకు అందరూ సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల ఉపాధ్యక్షులు రుద్రరాజు చిన్నారాజా, మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మజీరావు, మంగెన సింహాద్రి, జంపన బుజ్జిరాజు, నల్లి డేవిడ్, దొమ్మేటి ఉమ, గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీ భాస్కరరావు, గొల్లపల్లి శ్రీధర్, గెడ్డం రాజ్యలక్ష్మి, కొల్లాబత్తుల కుమార్, కొప్పిశెట్టి సీతా మహాలక్ష్మి, కోళ్ల వేణుప్రసాద్, తాడి వర్మ, సుందర తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డికి వలంటీర్ల మద్దతు



కొత్తపేటలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి మద్దతు తెలియజేస్తున్న అవిడ, ఖండ్రిగ గ్రామాల వలంటీర్లు

కొత్తపేట: గ్రామ వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని అవిడి గ్రామానికి చెందిన 34 మంది, ఖండ్రిగ గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు బుధవారం తమ రాజీనామాలను మండల పరిషత్ ఏఓ కృష్ణారెడ్డికి సమర్పించారు. అనంతరం కొత్తపేటలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని కలిసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వలంటీర్లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం ఇంటి వద్దకే అందించామని, ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూచనలతో ఆయన టీమ్ చేసిన ఫిర్యాదు వలన తమ సేవలు నిలిచిపోయాయన్నారు. తమను అనుమానించి, అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మేమే స్వచ్ఛందంగా రాజీనామా చేశాం.. ప్రజల్లోకి వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సీఎం జగనన్న గెలుపునకు కృషి చేస్తామని, వారి గెలుపును ఇంక ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అవిడి గ్రామ వలంటీర్లు జగ్గిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో వారితో పాటు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఖండ్రిగ వీడీసీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు తదితరులు ఉన్నారు. అలాగే కొత్తపేట గ్రామ పరిధిలో పనిచేసి రాజీనామాలు చేసిన వలంటీర్లు కూడా జగ్గిరెడ్డిని కలిసి తమ మద్దతు తెలియజేశారు.

సాగునీరు అందడం లేదని రైతుల నిరసన



బీటలు బారిన వరి పొలం

మామిడికుదురు: పంట పొలాలకు సాగునీరు అందడం లేదంటూ రైతులు బుధవారం నిరసన తెలిపారు. పాశర్లపూడిబాడవలోని సుమారు 80 ఎకరాల పంట పాలు పోసుకునే దశలో ఉందన్నారు. ఈ దశలో సాగునీటి సమస్యతో పంట పొలాలు నెర్రలు తీశాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగిన పక్షంలో పంట ఎందుకూ పనికి రాకుండా పోతుందని వాపోయారు. నగరం గ్రామంలోని పంట పొలాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందన్నారు. ఇక్కడ కూడా పంట పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణం ఈ సమస్యపై స్పందించి రెండు గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో రైతులు వేగి సత్యనారాయణ, మోకా రంగారావు, వి.సింహాద్రి, కడలి శ్రీనివాసు, చప్పిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 30 మంది చేరిక



పోతవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనను మెచ్చిన ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పోతవరం గ్రామం ప్రభలపుంతకు చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ వడలి కొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విప్పర్తి మాట్లాడుతూ సీఎం జగన్ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారని వివరించారు. పార్టీలో చేరిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, నాయకులు గుత్తుల దాసు, సబ్బితి చినబాబు, యాతం గరుడేశ్వరరావు, జిత్తుగ విజయప్రసాద్, మట్టపర్తి పండు, మానుకొండ వెంకటరమణ, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి వెంకటశివరామన్ తదితరులు పాల్గొన్నారు.

కరోనాలోనూ సంక్షేమ పథకాల అమలు

పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి



పోతవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచమంతా స్తంభించినప్పటికీ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కొనసాగించారని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని పోతవరంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ప్రజలను కలుసుకుని మాట్లాడారు. పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాకను గెలిపించాలని విప్పర్తి అభ్యర్థించారు. జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ఆయన అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను విప్పర్తి వివరించారు. పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ అందించిన సుపరిపాలనను ఓర్వలేని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అనేక కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో విప్పర్తికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, బండి మహాలక్ష్మి, నాయకులు మోకా సత్యనారాయణ, బండి రమేష్, మేడిశెట్టి రాంబాబు, అప్పన వెర్రిబాబు, సాధనాల రమేష్, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాణిక్యాంబ తీర్థం



మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారు

ఐ.పోలవరం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి మాణిక్యాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, కోలాటాలు, తీన్‌మార్, విచిత్ర వేషధారణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పచ్చిపూలతో అలంకరించారు. బుధవారం వేకువజామున 2 గంటలకు జాతీయ రహదారి 216పై నిప్పుల గుండం చూసేందుకు మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గత రెండు రోజుల్లో సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.


నేడు ట్రాఫిక్ మళ్లింపు

అంబాజీపేట: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గురువారం అంబాజీపేట పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌ను ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో మళ్లించినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కింది విధంగా ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు.

పి.గన్నవరం వైపు నుంచి వచ్చే వాహనాలు

పి.గన్నవరం వైపు నుంచి అమలాపురం వెళ్లే వాహనాలును మాచవరం నుంచి చిరతపూడి, అవిడి, ముక్కామల వైపు నుంచి అమలాపురానికి దారి మళ్లించారు. బోడసకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలు బోడసుకుర్రు బ్రిడ్జి నుంచి పి.గన్నవరం, కొత్తపేట వైపు వెళ్లే వాహనాలు భేతాళస్వామి గుడి నుంచి మెట్ల కాలనీ మీదుగా మాచవరానికి దారి మళ్లించారు. అమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు అమలాపురం నుంచి పి.గన్నవరం వెళ్లే వాహనాలు గంగలకుర్రు మలుపు నుంచి ముక్కామల, అవిడి మీదుగా దారి మళ్లించారు. కొత్తపేట, అయినవిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు అయినవిల్లి, ముక్కామల నుంచి వచ్చే వాహనాలు ముక్కామల అవిడి వైపు నుంచి పి.గన్నవరం వైపు మీదుగా వెళ్లాలన్నారు. మీటింగ్‌కు వచ్చే పార్టీ కార్యకర్తలకు పి.గన్నవరం వైపు నుంచి వచ్చే వాహనాలకు రాజోలు, పి.గన్నవరం నుంచి మీటింగ్ వచ్చే వారు మాచవరం పంచాయతీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలకు గంగలకుర్రు మలుపు వద్ద దొమ్మేటి వెంకట్రావు కొబ్బరితోటలో కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. బోడసకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలకు సాయికృష్ణ తల్లి పిల్ల హాస్పిటల్ పక్కనగల ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. కొత్తపేట, అయినవిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా లే అవుట్ నందు పార్కింగ్ చేసుకోవాలన్నారు.

ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుకలు



మామిడికుదురులో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: పవిత్ర రంజాన్ వేడుకలను ముస్లింలు బుధవారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. జాతీయ ముస్లిం నాయకుల సూచనల మేరకు మామిడికుదురు షియా జామియా మసీదు, నగరంలోని పెద పంజీషా, మొగలికుదురు మసీదులో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ, మెహదీ హసన్ బెహిష్తి, మహ్మద్ ఇబ్రహీమ్ ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. చిన్నారులతో పాటు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నెల రోజుల పాటు తాము చేసిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం అల్లా ఆమోదించాలని ప్రార్థనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ముస్లింలు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులకు మసీదు కమిటీలు సదుపాయాలు కల్పించాయి.

డాక్టర్ కొల్లూరికి ఉగాది ప్రతిభా పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి వాసవీ ఉగాది ప్రతిభా పురస్కారం లభించింది. మండపేటలో ఉగాది పర్వదినాన మంగళవారం రాత్రి జరిగిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు నూలు వెంకట రమణ మూర్తి చేతుల మీదుగా డాక్టర్ కొల్లూరికి ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం వాసవీ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సూర్యనారాయణ, కార్యదర్శి సమయమంతుల మురళీ, క్లబ్ వైస్ గవర్నర్ యెండూరి రాఘవ, జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీత తదితరులు పాల్గొన్నారు.

కవి నల్లాకు ఉగాది పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తికి హైదరాబాద్ 'మన మాతృ భాష తెలుగు సాహిత్య సామాజిక అంతర్జాతీయ మాస పత్రిక' క్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని అందించింది. ఈ ప్రశంసా పత్రాన్ని పత్రిక ప్రధాన సంపాదకురాలు కవిత చిర్ల బుధవారం ఆయనకు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తిని అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కళా వేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ అభినందించారు.

యానాం చేరుకున్న ఈవీఎంలు



కంటైనర్‌లో తీసుకొచ్చిన ఈవీఎంలు

యానాం: ఈ నెల 19న యానాంలో జరిగే పోలింగ్ కోసం పుదుచ్చేరి నుంచి ప్రత్యేక కంటైనర్లలో భారీ భద్రత మధ్య బుధవారం తెల్లవారుజామున ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎంలు) యానాం చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వీవీ ప్యాట్‌లను బెల్ సంస్థ నుంచి వచ్చిన ఇంజినీర్లు గురు, శుక్ర వారాల్లో రెండు రోజుల పాటు కమిషనింగ్ నిర్వహిస్తారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. యానాం నియోజవకర్గంలో 33 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేసిన ఒక్కో చోట రెండేసి చొప్పున బ్యాలెట్ యూనిట్లు ఉంచనున్నారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌కు 16 మంది అభ్యర్థుల పేర్లు, వారి గుర్తులు కనిపిస్తాయి. అయితే పుదుచ్చేరి స్థానానికి పోటీచేసే అభ్యర్థులు 26 మంది ఉండటం, ఒక నోటా బటన్ ఉండటంతో మొత్తం 27 బటన్‌లు ఉండాల్సి రావడంతో రెండేసి బ్యాలెట్ యూనిట్ల అవసరం ఏర్పడింది. ప్రత్యేక కంటైనర్లలో వచ్చిన పోలింగ్ సామగ్రిని ఆర్ఏఓ మునిస్వామి, ఎన్నికల శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు ఆధ్వర్యంలో రాజకీయ పక్షాల సమక్షంలో విడుదల చేసి కంట్రోల్ రూమ్‌కు తరలించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1988–89 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠశాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బండి సత్యనారాయణ దంపతులను వారంతా ఘనంగా సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజర్ ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ పి.మల్లవరంలో హైస్కూల్ ఏర్పాటు చేసిన అనంతరం తొలి బ్యాచ్ తమదేనన్నారు. తొలి బ్యాచ్‌కు గుర్తుగా తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక కార్యక్రమం చేయాలని తీర్మానం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఖండవిల్లి సురేష్, శారద, పద్మ, మధు, మూర్తి, చంటి, హరి, శ్యామ్, రవి, రామ్మోహన్‌రావు, అంబేడ్కర్, సాయి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.